# మరణము తరువాత - ఏమిటి?

"మరణించిన తరువాత వాస్తవంగా ఏం జరుగుతుంది!"
అని ఎప్పుడైనా నిన్ను నీవు ప్రశ్నించుకున్నావా?
పై ప్రశ్నకు ఈ చిన్న కరపత్రము బైబిలు అధారంగా ఎంతో
స్పష్టమైన సమాధానాన్ని తెలియజేస్తుంది.

ప్రచురణ: క్రిస్టడెల్ఫియన్స్

# పరిచయము:-

క్రిస్టడెల్ఫియన్లు షుమారు 80 దేశాలలో నివసిస్తున్నారు. క్రిస్టడెల్ఫియన్స్ అని పిలువబడే ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్న వారి విశ్వాసాలకు,నమ్మకములకు పరిశుద్ధ గ్రంథమే పూర్తిగా ఆధారమైయున్నది. ఇదే సత్యానికి ఏకైక పునాది.

ఎన్నో రకాలైన విశ్వాసాలు కలిగివున్న వివిధ సంఘాలు, క్రీస్తు తరువాత ఎన్నో వందల సంవత్సరాల నుంచి వారు వ్రాస్తున్న ప్రచురణలను చూస్తూనే ఉన్నాము. క్రీస్తు యొక్క అపోస్తలులు కూడా వారి వివిధ విశ్వాస సంబంధమైన భావాలను ,వివిధ సంఘముల బోధలు ఎరుగరు, కొన్ని సంధర్భములలో, బైబిలు ఉద్దేశమునకు, ఎంతో వ్యతిరేకంగా ఉన్నది.

క్రిస్టడెల్ఫియన్స్ (అనగా క్రీస్తునందున్న సహోదరులు, హెబ్రీ 2:11) క్రైస్తవులు అనబడే ప్రతి ఒక్కరూ బైబిలు చదవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము . ఒక వేళ నీవు క్రైస్తవుడవు కాకపోయినను, క్రైస్తవ్యం యొక్క సత్యాన్వేషన చేస్తున్నట్లయితే, నీ యొక్క క్రైస్తవ ఆత్మీయ జ్ఞానానికి, బైబిలు పఠనం ఒక్కటే పునాది అని నిశ్చయించుకోవలెను. అప్పుడు నీవు దేవుని రాజ్యానికి సంబంధించిన విషయాలను యేసు క్రీస్తును గురించిన సత్యాలను (అపొ. కా. 8:12) మరియు క్రీస్తులోనికి బాప్తీస్మం పొందడం అను విషయాన్ని, (గలతీ 3:27) పాపవిమోచనము గురించి (అపొ. కా. 2:38); మరియు ఆయన పునఃరుత్థానమందు భాగస్తులమవ్వటం అను విషయాలను గ్రహింపగలవు.

క్రిస్టడెల్ఫియన్స్, పరలోక సంబంధమైన మర్మమును గురించి క్రొత్తగా జ్ఞానోదయం పొందలేదు కానీ, పాప విమోచనమునకు, పాత మరియు క్రొత్త నిబంధనల పరిశుద్ధ గ్రంథమే సమర్థవంతమైన మార్గమని చేపట్టటం జరిగింది. (2 తిమోతి 3:15-17) పరలోకసంబంధమైన అధికారాన్ని కలిగివున్న బైబిలును నమ్ముతూ,బైబిలు అధారములేనివి కలిపి బోధించే ఏ రకమైనటువంటి బోధనలనైనను తిరస్కరిస్తాము. అనేకమైన సంఘాలు వివిధ రకాలైన మార్గములు కలిగివుండి ఎన్నో రకాలైన విశ్వాసాలు, నమ్మకాలు భావాలను కల్పిస్తున్నారు. మరియు ఆ రకమైనటువంటి కల్పనా కథలే బైబిలు యొక్క సారాంశముగా భావిస్తారు. అయితే క్రిస్టడెల్ఫియన్స్, అటువంటి వారికి వేరైయుండడానికి ప్రయాసపడుచున్నారు. క్రీస్తు రెండవసారి ఈ భూమి మీదకు వచ్చినపుడు భూమి మీద రాజ్యస్థాపన,రాజ్యపాలన చేస్తాడను బైబిలు ప్రవచనాలను స్థిరంగా నమ్ముచూ ముఖాముఖిగా క్రీస్తును దర్శిస్తామనియు నమ్ముచున్నారు. ఈ సత్యాన్ని ఇతరులకు తెలియజేసి ఆనందించాలని క్రిస్టడెల్ఫియన్లు ప్రయాసపడుచున్నారు.

# మరణము తరువాత – ఏమి జరుగును?

## మరణము నిజమైనది:

**Death is Real:**

నిజమైనటువంటి మరణము నుండి తప్పించుకొనుటకు మార్గమే లేదు. అది అకస్మాత్తుగా కానీ, ఊహించకుండా కానీ, లేక ప్రమాదవశాత్తుగాకానీ లేక గుండెనొప్పి వలన కానీ రావచ్చును, అప్పుడు మనం భయంతో చలిస్తాము. కొంత మంది క్యాన్సర్ తోను లేక కిడ్నీ జబ్బువలనో మరణమునక [illegible]వవుతూవుంటారు. ఈ రకమైనటువంటి సంఘటనలను మనం తరచూ [illegible]స్తూనే ఉంటాము, మరణాన్ని తప్పించుకోలేము, మన బలహీనతను,ఏమీ చేయలేని తనాన్ని జీర్ణించుకొనేవారమైయుండ వలెను. సర్వమానవ ప్రణాళికలేవీ కూడా మరణించిన వ్యక్తిని, తిరిగి జీవింపజేయగలిగే శక్తి కలిగి లేవు.

మరణం గురించి ప్రజలు ఏలా స్పందిస్తారు?

ఒక యువకుని స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మరంణించాడనే వార్త విన్నప్పుడు, ఆ యువకుడు అయ్యో...... ఇది చాలా దురదృష్టం అని తేలికగా చెప్తాడు. ఆ విషాదాన్ని అతిత్వరలోనే మరచిపోతారు. అదే మధ్యవయస్కుడైతే చనిపోడానికి చాలా సమయముంది ఎప్పుడొచ్చినా సరే! ఎదుర్కొనడానికి సిద్ధంగా వుండాలని భావిస్తాడు. అదే వృద్ధులైతే మరణం తప్పదనే సత్యాన్ని గ్రహించిన వారై, ఎంతో జాగ్రత్తగా జీవిస్తుంటారు. వారి యొక్క స్నేహితులు, మరియు బంధువులు జీవితమనే తెర నుంచి తొలగిపోతూనే ఉంటారు. కంటిచూపు మందగించటం, వినిపించకపోవటం, భౌతికమైన సమస్యలు వారికి జీవితం క్షణభంగురమని గుర్తుచేస్తూవుంటాయి.

## జీవించి ఉండుట?:

**Survival?:**

భారత దేశం మరియు, కొన్ని తూర్పు దేశాలు పునర్జన్మను గురించి, ఎంతో నమ్మకం కలిగివున్నాయి. దీనికి సంబంధించిన ఎన్నో కల్పనా కథలు మరియు

పురాణాలుకూడా వున్నాయి. అయితే వీటికి ఆధారమెక్కడ?

కొంత మంది మనుష్యునిలో, "అంతర్జీవి" ఉంటుందని దానినే "ఆత్మ" అంటారని, మనిషి మరణించిన తరువాత కృశించిపోయే శరీరం నుంచి వేరు పడి, పరలోకమునకు వెళ్ళి అక్కడ క్రొత్త వ్యక్తిత్వంతో జీవితం ప్రారంభిస్తాడని నమ్ముతూ ఉంటారు. ఈ తత్వానికి ప్రారంభంలో ఉన్నంత ప్రాధాన్యత ఇప్పుడు లేదు. ఇది ఇంగ్లండులోని కేంబ్రిడ్జి నందు గల కింగ్స్ కాలేజ్‌లో ప్రతి క్రిస్టమస్ ఈవ్ పండుగ రోజున కరోల్స్ సర్వీస్ నందు ఎంతో ప్రాచుర్యం పొందిన కథలను అనుసరిస్తూ, వారు చేసే ప్రార్థనల బట్టి మనకు అర్థమౌతుంది,వారి నాయకుడు ఈ విధంగా ప్రార్థన చేస్తాడు. ఈ యొక్క సంఘము ఇప్పుడు ఇంకొక లోకంలో ఒక గొప్ప వెలుగుని వారితో ఆనందించవలెనని అహ్వానిస్తాడు.ఇది ఏమిటి? ఇంకొక లోకం, లేక స్థలం? అని మనం అడిగినట్లైతే ఖచ్చితంగా మనం సరియైన సమాధానాన్ని పొందలేము.

కాథలిక్ చర్చ్ వారు దుష్టుల యొక్క "ఆత్మలు" "నరకమునకు" వెళ్తాయని, అక్కడ వారు బాధింప బడతారని వారియొక్క భావమైయున్నది. వీరు పాతాళము, నరకము, అగ్నిగుండము, మరియు పరదైసు, లేక స్వర్గము అను వాటి మీద గట్టి నమ్మకము గలవారై యున్నారు. వీరి నమ్మకాలకి ఆధారాలు లేవు. నీతిమంతుల ఆత్మలు పరలోకమునకు వెళ్తున్నట్లైతే, మరి దుర్మార్గుల "ఆత్మలు" ఎక్కడికి వెళ్తాయి?

అత్యధికంగా జనాభా ప్రబలుతున్న ఈ రోజుల్లో మరీ ముఖ్యంగా ఉత్తర ప్రపంచ దేశాలు అన్నీ కూడా, "మరణమే జీవితానికి పరిపూర్ణమైన ముగింపు" అనే సత్యాన్ని అంగీకరిస్తూ ఒప్పుకొనుచున్నారు. ఈ సత్యాన్ని గట్టిగా నమ్ముతున్నటువంటి ఒక వ్యక్తి, - ఇది నా జీవితం, నా యిష్టం, ఒకనాడు నేను చనిపోతాను కనుక, తింటాను, త్రాగుతాను, సుఖిస్తాను అంటాడు. ఈ రకమైనటువంటి అభిప్రాయాల వలన, ఇలాంటి ఉత్తర ప్రపంచం అంతా కూడా ఎంతో అనారోగ్యపూరితమైన సమాజంగా ఏర్పడడానికి కారణమైంది. ఇదే పద్ధతిని కొన్ని ఆసియా దేశాలు కూడా అనుసరించడం మొదలు పెట్టాయి.

## మృతులనుండి సమాచారం?:

**Messages from the Dead?**

విస్మరించలేని విషయం ఒకటి చూసినట్లైతే చరిత్రలో కోట్లానుకోట్ల మంది జీవించారు, మరణించారు, మరియు మట్టిలో పాతిపెట్టబడినారు. ఒకవేళ వారు ఒక క్రొత్త పద్ధతిలో, క్రొత్త దేహంతో పునఃర్జీవిస్తూవుంటే, వారితో ఒక మాటకానీ, లేక వారి పరిస్థితి అక్కడ ఎలావుందో లేక, బ్రతికున్న వారికి ఏమైన హెచ్చరిక ఇస్తారేమో..... మనం ఒక మాటైనా వారినుంచి వినడానికి ఆశించడం లేదా? ఇంతవరకు మరణించిన వారినుంచి ఒక సమాచారం కూడా మనం వినలేదు. కనీసం ఒక మాటకూడా! ఇది ఆశ్చర్యపడవలసిన విషయం కాదా? ఏది ఏమైనప్పటికి, మరణించిన ఈ కోట్లాను కోట్ల మంది ఎక్కడ?

కర్ణపిశాచము గలవారు (మాంత్రికులు):

కర్ణపిశాచము గలవారు (మాంత్రికులు) అని పిలువబడే వారు, ఈ పునఃర్జన్మ, అనే దాని మీద గట్టి నమ్మకం కలిగివుండి, మరణించిన వారి నుండి సమాచారం సేకరిస్తామని చెప్తూవుంటారు. అయితే సత్యాన్వేషన(Investigation) ద్వారా ఈ యొక్క పద్ధతులు అన్నీ , ఒప్పించలేనివని తేలింది. కొన్ని సంవత్సరాల క్రితం ఈ గ్రంథకర్త, ఆత్మలతో మాట్లాడే ప్రదేశాలను స్వయంగా సందర్శించి, వాటికి సంబంధించిన గ్రంథాలను చదవడం ద్వారా మృతులనుండి వినిపించని సమాచారం, గ్రహించడం విచిత్రమైన విషయం అని, వీరి నుంచి మామూలు ప్రదేశాల్లోనే సమాచారం సేకరించాలి కాని, "ఆత్మ" ను వారి దగ్గరకు పంపించడం విడ్డూరమైన విషయం అని తేల్చాడు. అంతే కాకుండ మరణించిన తరువాత - జీవితం, మంచి తోటల్లోను, ఆహ్లాదంగా ప్రవహించే నీటి కొలనులతోను, మంచి ఫల వృక్షాలతోను సుగంధభరితమైన సువాసనలు వెదజల్లే పూలతోను ప్రశాంతమైన ఒంటరి జీవితంతో ఆనందిస్తూవుంటారని చెప్తూవుంటారు. స్పష్టంగా గ్రహించినట్లైతే, ఇది కేవలం మనుష్యుల ఊహాచిత్రం మాత్రమే. ఈ యొక్క శాస్త్రంలో ఎంతో ప్రావీణ్యంకలిగి వున్నా సి. ఇ. యమ్, బోయడ్, అనే తత్వవేత్త, "ఆత్మలతో సమాచారం" అనేటటువంటి, విషయం మీద ఈ రకంగా

స్పందించాడు. సత్యాన్ని గ్రహించాలి అంటే ఒక్కటే సాక్ష్యం. "మన ఆత్మలు పునఃర్జీవించగలిగితే ఖచ్చితంగా మనకు మెదడు ఉండదనే అర్థం"

వీటన్నిటిని బట్టి చూసినట్లైతే గ్రహించవలసిన చిన్న విషయం ఒకటుంది. కొన్ని సందార్భాలలో, పురుషులు, స్త్రీలు, ఎంతో చక్కగా జీవిస్తూవుంటారు. ఒకరికొకరు సంభాషించుకోవటం, సహాయంచేయడం, కనికరం కలిగివుండటం, మరియు ఎంతో జ్ఞానం కలిగి ఉండటం కొందరు వారి రంగాలలో ఎంతో ప్రావీణ్యత కలిగి వుండటం ఇవన్నీ కూడా ఒక్కసారిగా (మరణంతో) పూర్తిగా పోగొట్టుకోవడం అవసరమా? మరి నిజమైనటువంటి విలువ కలిగివున్న మన యొక్క జీవితాన్ని, గుణాన్ని భద్రపరచుకొనే మార్గమే లేదా? మన జీవితం యొక్క నిజమైన విలువ ఏంటి? అనే ప్రశ్న సర్వసాధారణంగా ఉద్భవిస్తుంది. పై ప్రశ్నకు సమాధానం మనం ఇంక ముందున్న వాటిని చదివినట్లైతే తెలుస్తుంది.

## అందరికి సంబంధించిన ప్రశ్న:

**The Vital Question:**

మరణం తరువాత ఏం జరుగుతుంది? అను ప్రశ్నకు సరియైనటువంటి, సత్యమైన సమాధానం కావాలి అంటే మనం ఎక్కడికి వెళ్ళాలి?

మన యొక్క ఆలోచనలను లేక ఊహలను నమ్ముచున్నామా? అలాగైతే మన నమ్మకమే నిజమైనదని ఎలా తెలుసుకోగలం? మన సొంత అధికారంతో, మనం నమ్మిన విషయాన్నే ఇతరులు నమ్మాలని ఎలా ఆశించగలం? ఏ పురుషుడు కాని, ఏ స్త్రీ కాని మనకు సమాధానం ఎలా చెప్పగలరు? వాళ్ళకు ఎలా తెలుస్తుంది?

మనం మత పెద్దలు నమ్ముతున్న విషయాలను అంగీకరించట లేదు. లేక వ్యక్తిగత అభిప్రాయాలను విశ్వసిస్తున్నావూ? లేదు. ఏదైన ఒక సమూహాన్ని బట్టి విశ్వసిస్తున్నామా? లేదు. వాళ్ళకు ఎలా తెలుస్తుంది?

మరియు వివిధ మతసంబంధ పెద్దలు, వివిధమైన ప్రాముఖ్యముగల స్థానాల కోసం, తమని తాము విభజించుకొనుచున్నప్పుడు మనం ఏమని ఆలోచిస్తాము? ఒక ప్రావీణ్యం గల ఇంగ్లీషు బిషప్ క్రీస్తు నిజంగా మరణం నుండి లేవలేదని, ఇంకొందరు పునఃరుత్థానమనేది, కేవలం క్రైస్తవ విశ్వాసానికి వేసిన పునాదుల్లో ఒకటని

చెప్తూవుంటారు. వీళ్ళల్లో మనం ఎవరిని నమ్మాలి? ఎందుకు నమ్మాలి?

ఈ రకమైనటువంటి ప్రశ్నలు నిజాయితీగా ఎదుర్కొన్నప్పుడు మనలో ఒక్కొక్కరు ఏదో ఒకవైపుకు పురికొల్పబడతాము ఒక మనుష్యుని మనస్సు యొక్క అభిప్రాయం, అతనికే చెందివుంటుంది ఇతరుని అభిప్రాయం, ఇంకొకని అభిప్రాయానికి ఏ మాత్రం విలువైనదిగా ఉండదు. ఇంకొక రకంగా చెప్పాలి అంటే మనుష్యుని యొక్క సొంత ఆలోచన సరియైన సమాధానం ఇవ్వలేదు.

పై వాక్యాన్ని బట్టి చూసినట్లైతే ఎంతో ప్రాముఖ్యమైన విషయం బయలు పడుతుంది. పూర్వము నుంచి కూడా ఏ ఒక్క మనుష్యుడు (సొంత మనస్సుతో) మరణం తరువాత ఏం జరుగుతుందో అధికారంతో ప్రకటించలేదు, అప్పుడు మనకు స్పష్టంగా ఒక అధికారికంగా, బయటినుంచి, మరియు, మనుష్యుల ఆలోచనల కంటే అత్యున్నతమైన స్థానం నుంచి రావాలి, అదే సర్వశక్తిమంతుని అధికారము.

## సమాధానం:

## The Answer:

ఆ రకమైనటువంటి అధికారము, మన అందరిమధ్య సంచరిస్తూవుంది. అదే పరిశుద్ధ గ్రంథము. ఆదియును అంతమును తెలిపే వాక్యము. ఇది దేవుని నుండి మనుష్యులకు, వచ్చిన సువర్తమానము - భూమిని ఆకాశమును వాటిలోని సమస్తమును, మరియు మనుష్యుని సృష్టించిన దేవుని నుండి, వచ్చిన వాక్యము .బైబిలు యొక్క గ్రంథకర్తలు, ఎప్పుడు కూడా తమ సొంత అధికారముతో మాట్లాడలేదు, అయితే కేవలం "ప్రభువు యొక్క వాక్యం చేతనే," "ఇదిగో నేను నీ నోట నా మాటలు యుంచివున్నాను". (యిర్మియా 1:9 - 10) యేసు కూడా ధర్మశాస్త్రన్ని మరియు ప్రవక్తలను (పాతనిబంధన) దేవుని వాక్యమని అంగీకరించాడు. "నేను మాట్లాడుతున్న మాటలు నావి కావు దేవునివే," అని తనకు తానే స్పష్టంచేశాడు. అపోస్తలులు కూడా అదే విషయం చెప్పారు. అపోస్తలుడైన పౌలు "ధర్మశాస్త్రమంతయు" దైవావేశము వలన కలిగినది అని స్పష్టం చేశాడు మరియు "ప్రేరేపణ" అనే పదాన్ని ఉపయోగించాడు, దాని యొక్క అర్థము "దేవుడు

ప్రేరేపించెను " దేవుని యొక్క ఆత్మప్రేరణ చేత అని వ్రాయబడివున్నది. క్రీస్తునందున్న విశ్వాసులు, అపొస్తలులు, ఆనాడు ప్రత్యక్షంగా చూచి, వినిన వారందరూ, ప్రాత, క్రొత్త నిబంధన వ్రాతలు దేవుని వలన కలిగిన సత్య వాక్యమని అంగీకరించారా. కొన్ని శతాబ్దాల నుంచి కూడా, బైబిలు యొక్క బోధనలు క్రైస్తవ విశ్వాసానికి, పునాదిగా ఉంటున్నవి.

బైబిలు ఏమి బోధిస్తుందో కొంచెం ఆలోచించండి. ఇందులో, మనిషి యొక్క సృష్టి క్రమము, ఏవిధంగా జరిగిందో, మరియు కీడు ఎలా ప్రవేశించిందో, బాధలు, మరియు మరణము ఈ లోకంలోనికి ఎలా ప్రవేశించాయో కూడా స్పష్టంగా తెలియజేస్తుంది; మరణం తరువాత ఏమి జరుగుతుందో తెలియజేస్తుంది మరియు ఈ గ్రంథం యొక్క సందేశం మీద ఏకాగ్రత ఉంచినట్లైతే, మనకోసం ఏర్పాటు చేసివున్నటువంటి నూతన జీవితం గురించి కూడా తెలియజేస్తుంది.

పై విషయానలను చెప్పగలిగేటటువంటి వేరొక పుస్తకం ప్రపంచంలో మరొకటి లేదు. మనుష్య జ్ఞానంతో కాకుండా, ఎన్నో భవిష్యత్ సూచనలను తెలియచెప్పగల పుస్తకం, మరొక్కటి ఇంకెక్కడ కూడా లేదు. అయితే కేవలం దైవ జ్ఞానంతో బయలు పరచబడివుంది. షుమారు 100 సం॥ల క్రితం, హెన్రీ రోజర్స్ అనునతను "బైబిలు గ్రంథము ఒక మామూలు పుస్తకాన్ని, ఒకడు వ్రాసినట్లుగా వ్రాసింది కాదని - అందుకనే ఆ గ్రంథము, మనల్ని దాని మీద ఏకాగ్రత, కలిగి వుండే విధంగా పురికొల్పుతుంది " అని అన్నాడు.

## బైబిలు మరియు మనము:

**The Bible and Us:**

బైబిలు మనగురించి, మనఉనికి,మూలము, స్వభావము , స్థితిగురించి ఏం తెలయజేస్తుందో, తెలుసుకోవలసిన విషయం ఏంతో ప్రాముఖ్యమైనది. ఈ గ్రంథము ఒక్కటే మనం ఎక్కడనుంచి? ఎలా? సృష్టింపబడ్డాము అన్న విషయాన్ని ఎంతో అధికారికంగా తెలియజేస్తుంది. మన సృష్టిగురించి తెలియచెప్పే పుస్తకము ఆదికాండము. ఈ పుస్తకము మనిషి సృష్టింపబడిన ప్రాణి (జీవి) అని ఎంతో స్పష్టంగా తెలియజేస్తుంది. కనుక ఈ మనుష్యుడు తన యొక్క జీవిత కాలమంతయు అతని

సృష్టికర్త మీద ఆధారపడియున్నాడు. మనుష్యుని యొక్క పుట్టుకకు తనకు తాను ఎంత మాత్రము బాధ్యుడు కాడు. ఇది ఎలా జరిగిందో క్రింది విధంగా తెలుపబడివుంది.

"దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి అతని నాసికారంధ్రములలో జీవావాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" ( ఆది 2:7)

మనుష్యుని యొక్క సృష్టి విధానాన్ని చూడండి: కేవలం మంటినుండి, అంతే కాకుండా జంతువులు కూడా ( ఆది 6:17 మరియు 7:21) ఈ యొక్క "జీవవాయువును" మనుష్యుల వలెనే పంచుకున్నట్టుగా చూస్తాము. అయితే "జీవాత్మ" అను పదం, మన యొక్క ఏకాగ్రతను నిలపడానికి, మరీ ముఖ్యముగా మన యొక్క సొంత వివేచనతో కాదు కానీ, అందులో వ్రాయబడివున్నట్లుగానే అర్థము చేసుకోవాలి. కొంతమంది అర్థం చేసుకున్నట్లుగా "జీవము" అనేది మనిషిలోపల వుండే "ఆత్మ" అని అది శరీరం లేక దేహం యొక్క మరణాన్ని శాసిస్తుందని నమ్ముతూ వుంటూరు. అది ఆదికాండంలో ఎలా వాడబడిందో అది ది రివైస్డ్ స్టాండర్డ్ వర్షన్ (R.S.V) "జీవాత్మ" అను దానిని "జీవించే ప్రాణి" అని కనుక న్యూ ఇంటర్నేషనల్ వర్షన్ (N.I.V) మరియు ద న్యూ ఇంగ్లీష్ బైబిలు (N.E.B)లో "చలించే జీవి" అని వ్రాయబడివున్నది.

ముగింపు ఎంతో స్పష్టంగా ఉంది సృష్టింపబడిన విధానం, మరియు స్వభావిక స్థితిని బట్టి మనుష్యుడు కేవలం "జీవించే ప్రాణి" మాత్రమే ,ఒకవేళ జంతువులకంటే అత్యధికమైన విచక్షణా జ్ఞానం కలిగివుండవచ్చు అయితే ప్రధానంగా స్వభావ స్థితిని బట్టి చూస్తే అతడు జంతువులతో సమానమే.

## మరణ ప్రవేశము:

**The coming of Death:**

మనిషి యొక్క జీవితానికి ముగింపు ఎలా వస్తుంది. అనే విషయం, ఆదికాండము ప్రారంభంలో వ్రాయబడివుంది. ఆదాము తాను పొందిన ఆజ్ఞను మీరితే మరణమౌతాడని, దేవుని చేత చెప్పబడివున్నాడు. అతడు ఆజ్ఞను

అతిక్రమించాడు. అతనికి ప్రకటింపబడిన తీర్పు ఈ విధంగా వుంది.

నీవు నేలకు చేరు వరకు నీ ముఖపు చెమట కార్చి నీవు ఆహారము తిందువు; ఏలయనగా నీవు నేలనుండి తీయబడితివి, నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను ( ఆది. 3:19) పైన వ్రాయబడిన విషయం ఎంతో స్పష్టంగాను క్లుప్తంగాను వుంది: మరణమనేది క్రొత్త జీవితానికి తెరవబడే ద్వారంకాదు ఇది అవిధేయతకు ఇవ్వబడిన తీర్పు. మనిషి తిరిగి మంటికే చేరతాడు. కనుక ఆదికాండములో వ్రాయబడినట్లుగా ఎప్పుడైతే భూమి దేవుని ముందు చెడిపోయిందో మరియు, బలాత్కారముతో నిండివుందో, భూమి మీద సమస్త శరీరులు దేవుని యొక్క మార్గాన్ని చెరిపి వేసుకొని యుండిరో ( ఆది. 6:11-12) నీటి ద్వారా, తీర్పు వచ్చినప్పుడు, సమస్త శరీరులేమి, సమస్త నరులేమి సమస్తమును ఒకే మాదిరి నశింపజేయబడెను:

"అప్పుడు పక్షులేమి, పశువులేమి, మృగములేమి భూమి మీద ప్రాకు పురుగులేమి, భూమి మీద సంచరించు సమస్త శరీరులేమి, సమస్త నరులేమి చచ్చిపోయిరి" (ఆది 7:21-22).

## మనిషి మరియు జంతువులు:

**Man and Animals:**

బైబిలు మనిషి యొక్క భౌతిక స్థితిని జంతువులతో సరిసమానంగా పోలుస్తూవుంది. రెంటిని గురించి కీర్తనా కారుడు ఈ విధంగా స్పష్టం చేస్తున్నాడు.

"నీవు ముఖము మరుగు చేసికొనగా అవి కలత పడును నీవు వాటి ఊపిరి తీసివేయునప్పుడు అవి ప్రాణములు విడిచి మంటిపాలగును" (కీర్తన. 104:29)

ప్రసంగి గ్రంథకర్త ఈ విధంగా వ్రాస్తూవున్నాడు.

1. నరులకు సంభవించునది యేదో అదే, మృగములకు సంభవించును; వారికిని వాటికిని కలుగు గతి ఒక్కటే; నరులు చచ్చునట్లు మృగములును చచ్చును; సకల జీవులకు ఒక్కటే ప్రాణము; మృగములకంటే నరుల కేమియు ఎక్కువ లేదు;

సమస్తమును వ్యర్థము! సమస్తము ఒక్క స్థలమునకే పోవును; సమస్తము మంటినుండి పుట్టెను, సమస్తము మంటికే తిరిగి పోవును. (ప్రసంగి, 3:19,20)

మనుష్యులు మరియు జంతువులు, వాటి స్వభావ స్థితిని బట్టి ఒక్క దేహము (మాంసయుక్తమైనది)నే కలిగి వున్నారు: అవి సమస్తము కూడా మంటికే తిరిగి పోవును. అయితే ఆ తరువాత ఉన్న వచనాన్ని బట్టి కొందరు తిరస్కరించవచ్చు. అయితే అన్నీ క్రొత్త వర్షన్స్‌లలో ఆ వచనం (R.V. , S.S.V, N.I.V., N.E.B.) ఈ విధంగా ఉంది.

"నరుల ఆత్మ పరమునకెక్కిపోవునో లేదో మృగముల ప్రాణము భూమికి దిగిపోవునో లేదో ఎవరికి తెలియును?" (ప్రసంగి 3:21)

దీనియొక్క అర్థం, ఆ రెండింటిలో ఏమైనా తేడా ఉందని ఎవరు చెప్పగలరు? ఇక్కడ కూడా "ఊపిరి" అనే పదం ఉపయోగించవలసివుండగా "ఆత్మ" అని ఉంచడం జరిగింది. 3:19 వచనంలో "అత్మ" అని తెలియచేసే దగ్గర "ప్రాణము" అని మరియు "జీవము" అని వాడబడింది. ఊపిరి తీసివేసినప్పుడు సమస్తము మంటిపాలగును. కనుక "ఆత్మ" చనిపోగలదు. దేవుడు, గర్విష్టులైన ఐగుప్తీయులపై పది తెగుళ్ళు ద్వార తీర్పు తీర్చిన విధానాన్ని కీర్తన కారుడు ఈ విధంగా తెలియజేస్తున్నాడు.

"తన కోపమునకు ఆయన త్రోవ చదును చేసెను మరణమునుండి వారి ప్రాణమును తప్పింపక వారి జీవమును తెగుళ్ళునకు అప్పగించెను" (కీర్తన 78:50) పై వాక్యం "ఆత్మ" అనిన జీవము అనిన ఒక్కటే అని తెలియజేస్తుంది.

రెండు సార్లు దేవుడు యెహెజ్కేలు ద్వారా ఈ విధంగా తెలియజేశాడు:

"ఏ ఆత్మ అయితే పాపము చేయునో అది చనిపోవును" (యెహె 18:3,20) మరియు సమ్సోను, తన జీవితంలో చిట్ట చివరి ప్రార్థన ఈ విధంగా వుంది.

"నేనును, ఫిలిష్తీయులును చనిపోదుము గాక" (న్యాయా, 16:30)

కనుక ఆత్మ అనునది ఒక వ్యక్తి, జీవించు ప్రాణి, ఎప్పుడైతే మనిషి మరణిస్తాడో, ఆత్మ, జీవము, సమస్తము అతనితో పాటు నశించును.

## దేవుని స్వరూపమందు, నరుడు:

**Man in God's Image:**

అనగా మనుష్యులు జంతువుల కంటే గొప్పవారని కాదా? అలా కాదు కాని, ఆది. కా. 1:26 నరుడు దేవుని "స్వరూపమందు" చేయబడెను. మిగితా వాక్యాలను చూసినట్లైతే, మనిషి యొక్క శరీర తత్వం, కేవలం జంతువుల శరీర తత్వం వలెనున్నది. అయితే మనిషికి అర్థం చేసుకోడానికి, మరియు దేవునికి తగినట్లుగా, స్పందించడానికి ఎంతో వివేచనగల, మనస్సువున్నది. కీర్తన కారుడు ఎంతో విలువైన వాక్యాలను ఈ విధంగా రాశాడు:

"ఘనతనొంది యుండియు బుద్ధి హీనులైనవారు నశించు జంతువులను పోలియున్నారు" (కీర్తన 49:20)

దీనిని బట్టి మనిషికి, జంతువులకు కల వ్యత్యాసము తెలుస్తుంది. అది ఏమనగా అర్థం చేసుకొనే శక్తి. ఏవి అర్థం చేసుకోవటం? అనే ప్రశ్న వచ్చినప్పుడు, క్రొత్త నిబంధనలో మనం చూడవచ్చు.

బైబిలు ఆధారముగా చూసినట్లయితే, మృతులు విశ్రాంతి తీసుకుంటున్నారు, సమాధిలో పూర్తిగా స్పృహ లేని స్థితిలో ఉన్నారు. రాజులను కానీ మనుష్యులను కానీ నమ్మవద్దని కీర్తనా కారుడు అంటున్నాడు. ఏలయనగా

"వారి ప్రాణము వెడలిపోవును వారు మంటిపాలగుదురు. వారి సంకల్పములు నాడే నశించును". (కీర్తనలు 146:4) దేవుడు తనను విమోచించవలెనని దావీదు ఈ విధంగా ప్రార్థిస్తున్నాడు.

దేవుడు తనను తప్పించగలడని ఈ విధంగా ప్రార్థిస్తున్నాడు,

"మరణమైన వారికి నిన్ను గూర్చిన జ్ఞాపకము లేదు పాతాళములో ఎవరు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింతురు" (కీర్తన 6:5)

కీర్తన 115 కూడా ఈ విధంగా ఉంది

"మృతులను, మౌన స్థితిలోకి దిగిపోవు వారును యెహోవాను స్తుతింపరు" (వచనం 17) ప్రసంగి గ్రంథకర్త దృఢనిశ్చయంతో ఈ విధంగా వ్రాస్తున్నాడు.

"బ్రతికియుండువారు తాము చత్తురని ఎరుగుదురు. అయితే చచ్చిన వారు ఏమియు ఎరుగరు; వారి పేరు మరువబడి యున్నది వారికిక ఏ లాభమును

కలుగదు. వారిక ప్రేమింపరు, పగపెట్టుకొనరు, అసూయపడరు, సూర్యుని క్రింద జరుగు వాటిలో ఎప్పటికిని వారికిక వంతులేదు ..... చేయుటకు నీ చేతికి వచ్చిన ఏ పనినైనను నీ శక్తిలోపము లేకుండ చేయుము; నీవు పోవు పాతాళమునందు, పనియైనను, ఉపాయమైనను, తెలివైనను, జ్ఞానమైనను లేదు"

మృతుల యొక్క స్థలము ఈ విధంగా వర్ణించబడింది "అతని భూమిలో" (మనుష్యుడు ఏ మంటితోనైతే చేయబడ్డాడో) మరియు "మంటిలో" మరియు "నిశ్శబ్దంలో".

## మృతుల యొక్క నిద్రాస్థితి:

**The Sleep of the Death:**

ఈ విషయం మీద దానియేలు ఎంతో అసాధారణమైనటువంటి సందేశం ఇచ్చాడు, ముఖ్యంగా ఇది సూచన ప్రాయంగా తెలుపబడింది ఎందుకంటే, ఇదే విషయము క్రొత్త నిబంధనలో కూడా వ్రాయబడివుంది. ఇతని ప్రవచనము చివరి రోజుల్లో జరగబోయే విషయాలను, అనగా దేవుడు మరియొక్కసారి తన శక్తిని ఈ భుమి మీద, చూపించబోయే సమయం గురించి, అనగా "ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఈ భుమి అంతా సమస్యలతో నిండి ఉండే భవిష్యత్ కాలంగురించి"

"సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్యజీవము పొందుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు" (దానియేలు 12:2)

పై వాక్యము దేవుని యొక్క నమ్మకముగల సేవకుల గురించి, వారు స్వీకరించబోయే "నిత్యజీవము" గురించి చెప్పబడివుంది. అయితే ఈ ప్రతిఫలము, వారు స్వీకరించేంతవరకు ఎక్కడ ఉంటారు, అని చూసినట్లైతే, "సమాధులలో నిద్రిస్తు ఉంటున్నట్లుగా" వ్రాయబడివుంది, ఈ సాక్ష్యమే ముందు నుంచి ఇంత వరకు కూడా మనం చూశాము.

పై విషయాన్ని బట్టి కొంతమంది చదువరులు; ఇంత వరకు మీరు పాత నిబంధన గ్రంథం ఆధారంగా సూచిస్తున్నారు, అయితే ఖచ్చితంగా, క్రొత్త నిబంధన యేసుకు

సంబంధించినటువంటి ఒక క్రొత్త జ్ఞాన విషయాలను, మరియు సువార్తను, ప్రకటించడంలేదా? ఈ క్రొత్త నిబంధన కొంత తేడా కలిగి ఉండటం లేదా? అని చెప్పవచ్చు:

## యేసు, అపోస్తులులు మరియు పాతనిబంధన:

**Jesus, the Apostles and the Old Testament:**

పై ప్రశ్నకు సమాధానం కావాలి అంటే, యేసు క్రీస్తు, అతని తరువాత అపోస్తలుల గురించి మరియు ఇప్పుడు పాతనిబంధన అని పిలువబడుతున్న వచనాలను కూడా గమనించవలసి ఉంటుంది. సత్యము ఎంతో స్పష్టంగా వుంది. వాళ్ళందరు కూడా ధర్మశాస్త్రాన్ని, కీర్తనలను, మరియు ప్రవక్తలను, అన్నిటిని కూడా, దైవావేశము వలన కల్గిన వాక్యము అని విశ్వసించారు. వారి యొక్క ప్రసంగాలలో, పాతనిబంధన యొక్క వచనాలెన్నింటినో ఆధారంగా తీసుకొని సూచించడం జరిగింది, వారు ఎప్పుడు కూడా పాత నిబంధన గ్రంథంలోని వాక్యాలను బట్టి సందిగ్ధంలోకాని అనుమానంలో కాని పడలేదు. అయితే గ్రంథ మందు, సూచన ప్రాయంగాను, సాదృశ్యంగాను ఏం వ్రాయబడివుందో దాన్ని వారు వెతకడం జరిగింది. వారు పాతనిబంధన వచనాలతో కలిపి, బోధించిన బోధనలను, క్రొత్త నిబంధనలో చూసినట్లైతే నమ్మగలవా?

**కొన్ని ఉదాహరణలు:-**

యేసు కాలంలో, గలిలయలో ఎంతో విషాదకరమైన సంఘటన జరిగింది. మత సంబంధమైన విషయాలను బట్టి రోమా సైనికులు ఎంతో మంది, యూదులను చంపివేశారు కొంత మంది యూదులు యేసు దగ్గరకు వచ్చి జరిగిన విషయం చెప్పగా, యేసు సమాధానం ఎంతో సూచన ప్రాయంగా ఉంది. యేసు ఇలా అన్నాడు; చనిపోయిన గలిలయ మనుష్యులు, ఇంకా గలియలో జీవిస్తున్న గలిలయుల కంటే పాపులని మీరనుకొనుచున్నారా? కారని మీతో చెప్పుచున్నాను. మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు. (లూకా 13:1-3)

ఇప్పుడు, "నశించుట" బైబిలు ప్రకారంగా ఈ యొక్క మాట మనకు ఏమని అర్థం ఇస్తుంది, నశించుట అనగా కనిపించకుండా పోవడమే, అనగా మరెక్కడా జీవించరు. యేసు క్రీస్తు బోధ నుంచి తప్పించుకోలేము ఎందుకనగా "మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు"

కీర్తనలు 49:10లో వ్రాయబడివున్నటుగా

"జ్ఞానులు చనిపోదురను సంగతి అతనికి కనబడకుండా (అర్థం కాకుండా) పోదు, మూర్ఖులును పశుప్రాయులును ఏకముగా నశింతురు" మన ప్రశ్నకు పై వాక్యము సమాధానమిస్తుంది. ఏలయనగా! "అర్థంకావడం" అనగా ఏమి? ఇది పశ్చాత్తాపానికి సంబంధించి మనకు తెలియకుండానే జరిగే మొట్ట మొదటి క్రియ.

యేసు క్రీస్తు కూడా దానియేలు 12:2తో ఏకీభవించాడు. ఇది యోహాను సువార్తలో వ్రాయబడివున్నది.

"దీనికి ఆశ్చర్యపోకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలము సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవపునరుత్థానమునకును కీడుచేసిన వారు, తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28-29)

(యేసు, "ఉన్నవారందరు" అన్నమాట దానియేలు యొక్క "అనేకులు" అన్న మాట ఒక్కటే: వీరు కేవలం వారి జీవిత కాలంలో దేవుని కుమారుని శబ్దము విన్నటు వంటివారు) వచనం 25.

మరణించిన వారు ఎక్కడ ఉంటారు. "సమాధులలో" ( మంటిలో నిద్రిస్తున్నటువంటి వారు) పునఃరుత్థానంతో "తిరిగి వస్తారు"(వారు మేలుకొనెదరు) వారు నిత్యజీవమునకు కాని, లేక తీర్పులోనికి కాని లేపబడుదురు యేసుకు మరియు దానియేలుకు మధ్య వున్న సఖ్యత పూర్తి అయినది. ప్రభువైన యేసు పాత నిబంధనలోని వాటిని, అనగా మృతుల స్థలం, వారియొక్క స్థితి, వారి యొక్క శక్తి, గురించి ఎంతో అధికారికంగా బోధించాడు.

అపోస్తలులు కూడా ఇదే విషయాన్ని బోధించారు, యోహాను సువార్తలో, చాలా ప్రాచుర్యం ఉన్న వచనం

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16)

పైన మనం ఎన్నో వచనాలను చూశాం, అవి ఎంతో స్పష్టంగా ఉన్నాయి. అయితే ఎవరైతే యేసును విశ్వసించరో వారు తప్పించుకొనుటకు మార్గమేలేదు. వారు నశిస్తారు, అనగా ఇక కనిపించకుండా కొట్టివేయబడతారు.

అపోస్తలుడైన పౌలు, ఎఫెసులో ఉన్న సంఘమునకు, పై తెలుపబడిన సందేశమే వ్రాశాడు.

"ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణ లేని వారును, లోకమందు దేవుడు లేని వారునైయుండి, క్రీస్తుకు దూరస్థులైయుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి" (ఎఫెసి 2:12)

పై వచనమును బట్టి, మనము క్రీస్తు ద్వారా ఆయనకు ఇష్టమైన మార్గంలో దేవునికి చెందివున్నామా. లేక నిరీక్షణ లేని వారమైయున్నామా, ఏదైతే మనల్ని సంపూర్ణ నాశనం నుంచి తప్పిస్తుందో, అది అర్థం చేసుకోడానికి ఎంత విలువైన విషయమో గ్రహించండి.

అపొస్తలుడైన యాకోబు, తన పత్రికలో భవిష్యత్తులో మేము అది, ఇది చేస్తామని పూర్తి విశ్వాసం కలిగి ఉండకూడదని, రేపు ఏంజరుగుతుందో నీకు తెలియదని చెప్తూ

"రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవితమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే" (యాకోబు 4:14)

సమాధులలో "నిద్రించు" అనేకులు అని దానియేలు చెప్పిన విషయాన్నే అపోస్తలుడైన పౌలు కూడా, థేస్సలోనికలో క్రీస్తునందు ఉన్న విశ్వాసులకు వ్రాస్తూ

సహోదరులారా నిరీక్షణ లేని యితరులవలే మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడా వెంట బెట్టుకొని వచ్చును.

మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటే ముందుగా ఆయన సన్నిధి చేరము! ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును: క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. (1థెస్స, 4:13,16)

పై వాక్యము ఏం వాదిస్తుందో గ్రహించండి:

క్రీస్తునందు విశ్వాసముతో జీవించి మరణించి "నిద్రించిన" వారు; సమాధులలో నుండి మొదట లేతురు. ఇవన్నీ క్రొత్త నిబంధన అంతాకూడా బోధిస్తున్నటువంటి ఉపదేశములైయున్నవి. - అవన్నియు బైబిలు యొక్క సత్యానికి పునాధులైయున్నవి.

## మృతుల పునఃరుత్థానము:

**The Resurrection of the Dead:**

పునర్జన్మ: అనగా మరణించిన తరువాత మనిషి ఆత్మ లేక ప్రాణము పరలోకమునకు వెళ్తుందని నమ్ముట , మృతుల పునఃరుత్థానము, అనే విషయం నమ్మటం కష్టంగా ఉంటుంది.

ఇది సత్యమైన విషయమని యేసు క్రీస్తు యొక్క మాటల ద్వారా మరియొక సారి చూద్దాం

అయితే నీవు విందుచేయునప్పుడు, బీదలను, అంగహీనులను, కుంటివాండ్రను, గ్రుడ్డివాండ్రను పిలువుము, నీకు ప్రత్యుపకారము చేయుటకు వారికేమియు లేదు గనుక నీవు ధన్యుడవగుదువు; నీతిమంతుల పునఃరుత్థానమందు నీవు ప్రత్యుపకారము పొందుదువని చెప్పెను. (లూకా 14:14) మరణించిన విశ్వాసులు వారి యొక్క సమాధుల్లో నుండి లేప బడాలి. అప్పుడు, ఆ తరువాత వారికి రావలసిన ప్రతిఫలం స్వీకరిస్తారు.

అపోస్తులుడైన పౌలు, మృతుల పునఃరుత్థానం గురించి మొత్తం ఒక అధ్యాయమంతట కూడా తెలియజేశాడు. ఈయన ఒక ప్రత్యేకమైన తరహాలో

....క్రీస్తు మృతులలోనుండి లేపబడని యెడల, ఇంకెవ్వరును లేపబడరు. అంతే కాకుండా, విశ్వాసంతో నిద్రించిన వారు కూడా నశిస్తారని. (1కొరింథీ 15:18) అలాగైతే- మన విశ్వాసం వ్యర్థమని-అందుచేత పునరుద్ధానం అసత్యమని బోధించారు.

అయితే ఎంత మాత్రమును సందేహం లేదు, క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు అని పౌలు చెప్తూవున్నాడు. ( ఆయన లేపబడియున్నాడని సాక్షి సమూహంతో ఇచ్చిన పట్టిక, 1కొరింథీ 15:3-8 వరకు చదవండి) మరియు క్రీస్తు, నిద్రించిన వారిలో ప్రథమ ఫలము అయ్యాడు (వచనం 21) ఈ యొక్క 3, వచనాలలో రెండు సార్లు మరణించిన వారు నిద్రింస్తున్నారు అని వ్రాసాడు, దానియేలుతో ఏకీభవిస్తూ ఈ అధ్యాయంలో, విశ్వాసంతో మృతిచెందిన మృతుల పునఃరుత్థానం తరువాత, వారికి మార్పు పొందిన స్థితి, ఉంటుందని గుర్తుచేస్తున్నాడు. రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొననేరవు. ప్రస్తుత మన శరీర స్థితి, మృతతుల్యమైనది, మరియు నశించే గుణముగలది. అయితే ఎప్పుడైతే మృతులు లేపబడతారో వారు "మార్పు" చేయబడతారు ఈ యొక్క క్షయమైనది, అక్షయమైనదిగా మార్పు చెందాలి, మరియు ఈ మృతతుల్యమైనది, అమరత్వం పొందాలి, "విజయ మందు మరణము మ్రింగివేయుబడెను అను దానికి మార్గము"(1కొరింథీ 15:50-54)

## అయితే.....?

**But.......?**

క్రొత్త నిబంధనలో, మరణము తరువాత కూడా, జీవితం ఉంది అను దానికి, బలాన్ని చేకూర్చే వచనాలు ఏమీ లేవా?

ఈ యొక్క అంశాన్ని తెలియజేప్పే వచనాలు కొన్ని వున్నవి. ఎప్పుడైతే మీరు జాగ్రత్తగా పరిశీలించ గలుగుతారో, అప్పుడు బైబిలు గ్రంథమంతయు కూడా ఒకే అంశాన్ని తెలియజేస్తున్నట్లుగా గ్రహించగలరు. కొన్ని ప్రాముఖ్యమైన విషయాలను మేము ఇక్కడ తెలియజేస్తున్నాము.

*పాతాళము (Hell)*:

పాత నిబంధనలో, ఈ యొక్క పదము అనగా "పాతాళము" అనుదానికి పూర్తిగా కప్పివేయబడిన స్థలం అని అర్థాన్ని ఇచ్చే విధంగా వ్రాయబడింది. ఈ "పాతాళము" అను పదము షుమారు 31 సార్లు వాడబడింది. అదేవిధంగా సమాధి లేక (గుంట) అను పదం కూడా 31 సార్లు వ్రాయబడింది.

(యాకోబు తప్పిపోయిన తన కుమారుడు యోసేపును గురించి ఈ విధంగా రోదిస్తున్నాడు)

"అతడు ఓదార్పు పొందనొల్లక - నేను అంగలార్చుచు మృతుల లోకమునకు నా కుమారుని యొద్దకు వెళ్ళెదనని చెప్పి అతని తండ్రి అతని కొరకు ఏడ్చెను" ( ఆది. కా. 37:35)

"పాతాళమునందు ఎవరు నీకు స్తుతులు చెల్లించెదరు" కీర్తనలు 6:5)

"చేయుటకు నీ చేతికి వచ్చిన యేపనినైనను నీ శక్తిలోపము లేకుండ చేయుము: నీవు పోవు పాతాళమునందు, పనియైనను, ఉపాయమైనను తెలివైనను లేదు"(ప్రసంగి 9:10)

అదే విధంగా క్రీస్తును గూర్చిన ప్రవచనం ఈ విధంగా వుంది.

"ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు"

"నీ పరిశుద్ధుని కుళ్ళు పట్టనీయవు". అనగా "దేవుడు తనను కాని, తన జీవమును కాని ఎంత మాత్రమును విడిచిపెట్టడు, అని లేక, ఆయన యొక్క పరిశుద్ధున్ని నశించనీయడని"(కుళ్ళిపోనీవడని) వ్రాయబడివుంది (కీర్తనలు 16:10) ఇదే వచనము క్రొత్త నిబంధనలో అపోస్తలుడైన పేతురు కూడా సూచించాడు. (అపో. కా. 2:31). ఇక్కడ ఆయన గ్రీకు పదం ఉపయోగించాడు, అనగా పేతురు, కీర్తనకారుడు రాసినటువంటి విషయాన్ని సరిగా అర్థంచేసుకొని ఉన్నట్లుగా గమనించగలము.

గెహెన్నా (Gehenna):-

ఏది ఏమైనను, క్రొత్త నిబంధనలో ఎంతో ఆసక్తి కలిగించే ఇంకొక పదం వ్రాయబడివుంది. "నరకము". ఇది ఇంగ్లీషులో గెహెన్నా అని వ్రాయబడివుంది.

ఈ "గెహెన్నా" అనునది యెరూషలేము పట్టణమునకు, బయట ఉన్నటువంటి ఒక స్థలం యొక్క పేరు. (గ్రిమ్ - తెయర్స్), (గ్రీకు - ఇంగ్లీషు లెక్సికన్ అను క్రొత్త నిబంధన గ్రంథం నుండి, వాడబడిన ఈ క్రింది ఉదహరించినటువంటి విషయం ఎంతో ఉపయోగకరమైనది;

"గెహెన్నా" అనగా దుఃఖపులోయ..... ఇది యెరూషలేమునకు, తూర్పు మరియు దక్షిణవైపునవున్న లోయ పేరు, ఎద్దు స్వరూపమున్న మొలేక్ అనే విగ్రహానికి చిన్న పిల్లలను బలి ఇచ్చేవారు వారి రోధనలవలన దీనికి గెహెన్నా అని పిలువబడినది. రాజైన యెషీయా కాలములో, యూదులు ఈ రకమైనటువంటి బలులను, సమాధి చేయడం నిషేధించడం జరిగింది. (2వ రాజులు 2:10) ఆరకమైనటువంటివే కాకుండా జంతువుల కళేబరాలను, సమాధి చేయని నేరస్థులను అందులో వేసేడివారు. కనుక ఈ యొక్క కళేబరాలను దహించడానికి, ఎప్పుడూ మండుతూ ఉండే నిప్పు అవసరమై ఉండేది. కాలుతున్న శరీరుల వాసన కూడా పైకి వచ్చేడిది కాదు. ఈ రకమైనటువంటి స్థలం పేరే "గెహెన్నా" యొక్క మంటలు.

ఈ గెహెన్నా అను పేరు క్రొత్తనిబంధనలో 12 సార్లు వాడబడింది, వాటిలో 11 సార్లు యేసు క్రీస్తు ద్వారా వాడబడినది, ఉదాహరణకు:

"నీకన్ను నిన్ను అభ్యంతర పరచిన యెడల, దాని తీసి పారవేయుము; రెండు కన్నులు కలిగి నరకములో పడవేయబడుటకంటే ఒంటికన్ను గలవాడై జీవములో ప్రవేశించుట మేలు" మార్కు 9:43-48)

పైవచనాల యొక్క అర్థం ఈ విధంగా ఉంది.

నీవు ఏదైనా నీ చేతితో పని చేయవలిసివచ్చినప్పుడు, నీ కాళ్ళతో కూడా వెళ్ళ వలసివుంటుంది.

నీ కంటితో నీవు ఏదైనా చూస్తున్నపుడు, అది దేవుని రాజ్య ప్రవేశమునకు అభ్యంతర కరంగా ఉంటే, వాటినే మానుకో, లేదా దుష్టులు మరణించినట్లుగా వారితో పాటే నీవు నశిస్తావు. వేడి, నిప్పు అనునవి పూర్తిగా నశింపజేసే వాటికి సాదృశ్యమైనటువంటివి. వారు నిరంతరము ఉండరు కానీ సమూలంగా నశిస్తారు. కనుక అంత్యదినమున, దుష్టులకు ఇచ్చేటటువంటి తీర్పుకు ఈ గెహెన్నా అను పదం

సాదృశ్యంగా వాడబడింది.
"గెహెన్నా" (నరకం) అను పదం ఉపయోగించిన ప్రతి దగ్గర కూడా ఇదే అర్థం ఇస్తుంది.

ప్రాణము (*The Soul*):- పాత నిబంధన వచనాల ద్వారా "ప్రాణము" అనగా "ఒక వ్యక్తి" అనియు లేక వ్యక్తి యొక్క "జీవము" అనియు, అది పాపము చేయగలదు. మరియు మరణించగలదనియు చూశాము.

ఇదే పదము క్రొత్త నిబంధనలో కూడా షుమారు 100 సందర్భాలలో వాడబడినది. 58 సార్లు ప్రాణము, అని 40 సార్లు జీవము అని మరియు 3 సార్లు మనస్సు అనియు వాడబడినవి. యేసు క్రీస్తు సూచన ప్రాయంగా తన శిష్యులతో చెప్పిన విషయాలలో ఒక దానిని చూసినట్లైతే

ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను "ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" అంతే కాకుండా తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు, దాని పోగొట్టు కొనును, నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును. ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటె అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు? (మత్త 16:25-26)

చదువరులు ఇక్కడ ఉపయోగించిన జీవము మరియు "ప్రాణము" అను రెండు పదాలలో ఉన్న తేడా ఏమిటని ఆలోచించవచ్చు అయితే రివైస్డ్ వర్షన్ నందు, మరియు రివైస్డ్ స్టాండర్డ్ వర్షన్ నందు నాలుగు సందర్భాలలో ఉపయోగించిన వివిధ పదాలకు జీవము అను పదాన్నే తర్జుమా చేయడం జరిగింది.
వేరొక సందర్భములో ఈ విధంగా చెప్పబడివుంది:

"మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడా నరకములో నశింపజేయుగలవానికి మిక్కిలి భయపడుడి" (మత్తయి 10:28)

ఆత్మ నశించిపోగలదు, అని యేసు చెప్పిన విషయం గ్రహించడానికి అంత కష్టంగా

లేదు, ఎందుకనగా ఒక విశ్వాసము గల సేవకుడు మృతినొంది నట్లైతే అతడు తన యొక్క జీవమును ( ఆత్మను) తిరిగి పొందగలడు - పునఃరుత్థానమందు మనం చూసినట్లుగా - విశ్వాసము లేనిసేవకుడు మృతినొందినట్లైతే గెహెన్నా లేక నరకము, అని సూచన ప్రాయంగా చెప్పబడిన విధంగా అతని యొక్క "ఆత్మ" లేక "జీవము" అనునది పూర్తిగా అతనితో పాటే నశిస్తుంది.

*ధనికుడు మరియు లాజరు (The Rich Man and Lazarus)*: -

పై చెప్పబడిన విషయాలను మీకు అంగీకారముగా ఉండనియెడల, ఈ క్రింద వ్రాయబడిన దానిని జాగ్రత్తగా గమనించగలరు (లూకా 16:19-31)

లాజరు అను దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రాహాము రొమ్మున ( ఆనుకొనుటకు) కొనిపోబడెను, ధనవంతుడు కూడా చనిపోయి పాతి పెట్ట బడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును, అతని (రొమ్మున) ఆనుకొనియున్న లాజరును చూచి! తండ్రివైన అబ్రాహామా, నా యందు కనికరపడి, తన వ్రేలికొనను - నీళ్ళలో ముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము; నేను ఈ అగ్నిజ్వాలలో యాతన పడుచున్నానని, బ్రతిమాలుకొనెను, అయితే అతని యొక్క విజ్ఞాపన తిరస్కరించబడింది - పూర్వము ధనికుడైనటువంటి ఆ మనుష్యుడు, అతని శిక్షను తప్పక భరించవలసినదే. అంతే కాకుండా, అబ్రాహాము, "మీకును మాకును మధ్య మహా అగాధముంచబడినది" మీ యొద్దకు దాటగోరువారు దాటిపోజాలకుండునట్లును, అక్కడి వారు మా యొద్దకు దాటి రాజాలకుండునట్లును అని చెప్పాడు.

అప్పుడు ఆ ధనికుడు, అతనికి అయిదుగురు సహోదరులు ఉన్నట్లుగా, వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండునట్లు సాక్ష్యమిచ్చుటకై లాజరును పంపమని వేడుకొనెను. ఈ యొక్క విజ్ఞాపన కూడా తిరస్కరించబడింది.

ఇప్పుడు, పైన తెలుపబడిన వచనాలను, ఉన్నవి ఉన్నట్టుగా అర్థం చేసుకోడానికి అసాధ్యమని, ఈ క్రింది విధంగా నిరూపిస్తున్నాము. అబ్రాహాము యొక్క రొమ్ము అనునది నీతి మంతులు మరణం తరువాత చేరుకునే స్థలమునకు సాదృశ్యంగా ఉంది. అదే విధంగా అగ్ని జ్వాలలో యాతనపడుచున్న వానియొక్క

గొంతు తడపడానికి ఒకనిని ఒక స్థలమునుంచి మరియొక స్థలమునకు పంపడమనేది. మరణించిన వారియొక్క పునఃస్థితిని తెలియజేయడం కాదు కానీ ఇది ఒక ఉపమానరీతిగా మాత్రమే చెప్పబడివుంది. ఎందుకనగా అగ్నిగుండము, లేక నరకముఅనునవి ఆనాటి పరిసయ్యుల సంస్కృతిలో ప్రధానమైన నమ్మకాలు.ఆ మొదటి శతాబ్దపు కాలానికి చెందిన జోసేఫ్ అను యూదా చరిత్రకారుడు "నరకము" అను అంశం మీద వివరణ చెప్పాడు. యేసు క్రీస్తు వారి యొక్క సొంత ఆలోచనలను లేక సొంత భావాలను, త్రోసిపుచ్చాడు. అయితే యేసు ఆయన యుక్క ఉపన్యాసంలోని చివరి వాక్యాల ద్వారా, అసలైన విషయాన్ని స్పష్టంగా తెలియచేశాడు. ఎప్పుడైతే ఆ ధనికుడు తన యొక్క అయిదుగురు సహోదరులకు సాక్ష్యమిచ్చుటకై లాజరును పంపమని అబ్రాహామును వేడుకొంటాడో, అప్పుడు అబ్రాహాము ఈ విధంగా సమాధానమిస్తాడు. అందుకు అబ్రాహాము - వారియొద్ద "మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని వారితో చెప్పగా అప్పుడు ఆ ధనికుడు "తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారి యొద్దకు వెళ్ళిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను;" అందుకు అబ్రాహాము! మోషేయు ప్రవక్తలును (చెప్పిన మాటలు) వారు వినిన యెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరనెను"

ఈ ఉపమానం అతి కొద్ది కాలంలోనే సంపూర్ణం చేయబడింది. యేసు నిజమైన లాజరును - అనగా మార్త, మేరి అనువారి సహోదరుడిని మరణం నుంచి లేపాడు. ఈ యొక్క అద్భుత క్రియ ప్రజలలో ఎంతో చైతన్యం సృష్టించింది. అయితే యూదా నాయకులు ఈ సత్యాన్ని అనగద్రొక్కవలెనని, యేసును చంపడానికి గట్టిగా నిర్ణయం తీసుకున్నారు. అది జరిగిన అతి కొద్ద సమయంలో, యేసు తనకు తాను మరణంలోనించి, సజీవంగా లేచాడు. అయినప్పటికీ యూదా అధికారులు ఇంతటి శక్తివంతమైన సాక్షాన్ని ఆయన పునరుత్థానాన్ని త్రోసిపుచ్చి, ఆయన దేవుని కుమారుడు అను సత్యాన్ని తిరస్కరించారు. అంతే కాకుండా నిజానికి మోషే మరియు ప్రవక్తలు రాసిన వారియొక్క సొంత గ్రంథాలను కూడా వారు నమ్మలేదు. మరియు, సాక్ష్యాలన్నిటిని బట్టి రాబోవు మెస్సీయా యేసే అని కూడా వారు అంగీకరించలేకపోయారు.

ఏ మాత్రం సంశయం లేకుండా పైన వివరించిన సందేశమే. ధనికుడు - మరియు లాజరు, అను ఉపమానం యొక్క సంపూర్ణ అర్థమై వున్నది. యేసు ఏం చెప్పాలనుకున్నాడో ఆ విషయాన్ని ఈ ఉపమానం ద్వారా ఎంతో ఖచ్చితమైన సత్యాన్ని తెలియజేశాడు. అయితే ఈ ఉపమానం మరణం యొక్క స్థితిని తెలియజేయడం లేదు. కనుక మనం పరిశుద్ధ గ్రంథమంతటిని పరిశీలించవలసివుంటుంది.

*సిలువపై దొంగ(The Thief on the Cross)*:- లూకా 23:39-43లో చెప్పబడిన ఉపమానం ఈ విధంగా ఉంది. యేసు సిలువ వేయబడి ఉండగా ఆయనతో పాటు సిలువ వేయబడిన ఇద్దరు దొంగల్లో ఒకడు, తనకు పడిన "శిక్ష న్యాయమైనదే" అని పశ్చాత్తాపపడుతూ, అయితే "ఈ మనుష్యుడు ఏ తప్పిదము చేయలేద"ని అంటూ యేసువైపు తిరిగి ఈ విధంగా చెప్పడం జరిగింది.

"ఆయనను చూచి - యేసూప్రభు, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను." (వచనం 42)

"ఇది ఎంతో ఆశ్చర్యకరమైన విజ్ఞాపనయైవున్నది"

ఈ క్రింది విషయాలను చూడండి:

1. ఆ దొంగకు యేసు "ప్రభువే" ఉన్నాడు.
2. యేసు సిలువ మరణం నుంచి, తిరిగి జీవిస్తాడని నమ్ముచూ ఉన్నాడు
3. మరియు భవిష్యత్కాలములో "యేసు తన రాజ్యములోనికి వస్తాడని" నమ్ముచూ ఉన్నాడు.
4. ఆ సమయంలో యేసు తనను గుర్తుచేసుకోగలడని మరియు తనను తిరిగి జీవింపచేయగలడని నమ్ముచూ ఉన్నాడు.

ప్రారంభము నుంచి కూడా క్రొత్త నిబంధన ఏదైతే బోధిస్తూవున్నదో, వాటన్నిటిలో చూడగా పై విషయాలు ఎంతో అంగీకరించదగినవిగా ఉన్నవి.

ఇప్పుడు యేసు యొక్క సమాధానం చూడండి:

అందుకాయన వానితో - నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని

నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను.

ప్రాచీన గ్రీకు వ్రాత ప్రతులు చూసినట్లైతే పై వచనమంతా కూడా గ్రీకు వ్యాకరణంలోని పెద్ద అక్షరాలతో వ్రాయబడివుంది. మరియు పదాలుకూడా విడి, విడిగా లేవు మరియు విరామ చిహ్నములు (ఉదా: , . : ! మొదలగునవి) కూడా లేవు అప్పుడు యేసు ఏం చెప్పాడో నీవు ఎలా అర్థం చేసుకోగలవు?

"నిశ్చయముగా నేను నీతో చెప్పుచున్నాను, నేడు నీవు నాతో కూడా పరదైశులో ఉందువు?" అనెనా? లేక

"నిశ్చయముగా, నేడు నీతో చెప్పుచున్నాను, నీవు నాతో కూడా పరదైశులో ఉందువు?"

కనుక యేసు చేసిన ఆ వాగ్దానం అర్థం చేసుకోడానికి ఎంతో తేడా కనిపిస్తుంది. ఆయన వాగ్దానమిదే అని మనం ఎలా నిర్ణయించగలం? వ్యాకరణ ప్రకారంగా సెమెరన్ (Semeron) (నేడు) అను పదం, ముందుగా వాడివుండవచ్చు లేక తరువాత వాడివుండవచ్చు. అయితే ఇక్కడ ఇంకా కొన్ని ఇతర విషయాలను పరిగణలోకి తీసుకోవలసిన అవసరం వుంది.

యేసు పై వాక్యాన్ని పాత నిబంధనలోని హెబ్రీలో వ్రాయబడిన కొన్ని అంశాల మీద తగిన అవగాహన కలిగివుండి, ఉపయోగించియున్నాడు. ఇక్కడ ఒకే అధ్యాయంలోనుంచి మూడు ఉదాహరణలను గమనించగలరు (ద్వితి. కా. 4:26, 39, 40)

1. "కాబట్టి, పైనున్న ఆకాశమందును క్రిందనున్న భూమి యందును యెహోవాయే దేవుడనియు, వేరియొక దేవుడు లేడనియు నేడు నీవు ఎరిగి..... నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నేడు నేను నీకు ఆజ్ఞాపించుచున్నాను....."

ఈ "నేడు" అనే పదం సర్వసాధారణంగా, ఖచ్చితంగా, లేక ఒక సత్యాన్ని చెప్పేటప్పుడు ఉపయోగిస్తుంటారని స్పష్టంగా చెప్పగలం, ఈ ద్వితియోపదేశాకండములోనే ఈ "నేడు" అనే పదం షుమారు 42 సార్లు వ్రాయబడివుంది కనుక యేసు ఎంతో ప్రాముఖ్యముగల తన వాక్యాలను గుర్తించులాగున కొన్ని హెబ్రీ పదాలను వాడివున్నాడు. "నేడు నేను నీతో చెప్పుచున్నాను" కనుక యేసు చెప్పిన విషయం భవిష్యత్‌లో జరగబోవునది అని ఆ

దొంగ గ్రహించి ఉండవచ్చు.

2. ఏది ఏమైనప్పటికిని ఆ "నాడు" యేసు ఎక్కడవున్నాడు? మహిమలో కాదు, పరలోకంలో కాదు, ఆయన సమాధిలో ఉన్నాడు. శిష్యులకును, పరిసయ్యులకును తనకు తాను ప్రవచించినట్లుగా "మనుష్య కుమారుడు మూడు రాత్రులు మూడు పగళ్ళు భూగర్భములో ఉండును" (మత్తయి 12:40) గర్భము అనగా హెబ్రీ నందు "మధ్య" అను అర్థం వస్తుంది ఇక్కడ ఆయన యొక్క అర్థం "సమాధి"

3. పరదైసు అనగా మనకు ఏం అర్థం అవుతుంది? మరియొకసారి మనం, మనుష్యుల సంస్కృతుల ద్వారా కాదు కానీ బైబిలు ఆధారంగానే సమాధానం పొందవలసి ఉంటుంది. ఇది నిజానికి "పెర్షయన్" పదం, ఇది పాతనిబంధనలో అడవి, పండ్లతోట, లేక వనము అని వాడబడింది. యెషయా ఈ విధంగా స్పష్టపరుస్తున్నాడు. ఎప్పుడైతే దేవుని యొద్దనుండి "అనుకూలమైన సీయోనును" స్థాపించడానికి సమయం వస్తుందో అప్పుడు "యెహోవా సీయోనును ఆదరించుచున్నాడు దాని పాడైన స్థలములన్నిటిని ఆదరించి దాని అరణ్యస్థలములను ఏదేనువలే చేయుచున్నాడు దాని ఎడారి భూములు యెహోవా తోటవలె ...." (యెషయా 51:3)

పాతనిబంధనను గ్రీకులోనికి తర్జుమా చేసినటువంటి వారు (షుమారు క్రీస్తుకు 2000 సంవత్సరాలకు పూర్వం) హెబ్రీ భాషలో వ్రాయబడివున్న "వనము"ను పదాన్ని వీరు గ్రీకులో "పరడెసియన్" ను దానిగా తర్జుమా చేశారు. ఈ పదాన్నే దొంగకు ఇచ్చిన సమాధానంలో ఉపయోగించాడు. ఇక యెషయా గ్రంథంలోని ప్రవచనం, క్రీస్తుకు ముందే ఇశ్రాయేలు స్వాధీనం చేసుకున్నటువంటి, ఫలవంతమైన, మరియు సారవంతమైన "వాగ్దానభూమి" గురించినటువంటిది. కనుక "పరదైసు" అనునది బైబిలు ప్రకారంగా చూసినట్లైతే యేసు క్రీస్తు తన రెండవ రాకడలో ఈ భూమి మీద స్థాపింపబోయే, శాంతి, సమాధానాలతో నిండివుండే నూతన రాజ్యానికి సాదృశ్యంగా వున్నది. అందుకనే "యేసూ నీవు నీ రాజ్యములోనికి వచ్చినప్పుడు" అని సిలువపై దొంగ నమ్మకముకలిగివున్నాడు. కనుక పై సారాంశము

గ్రీకుల పురాణమునకు ఏ మాత్రము సంబంధించిలేదు. అయితే పై బోధన అంతా పరిశుద్ధ గ్రంధమునకు ఎంతో పొంతన కలిగివుంది.

మరణము తరువాత కూడా జీవించివుండే ఆత్మ అను దానిని నమ్మడానికి, బలాన్ని చేకూర్చే కొన్ని ఉపన్యాసాలు ఉన్నప్పటికీ, ఎంతో సునిశిత పరిశీలన ద్వారా, మరియు బైబిలు ఆధారమైనటువంటి పొంతనల ద్వారా, సరియైన సమాధానాన్ని పొందవచ్చు.

## ఈ నమ్మిక ఎందుకు వ్యాప్తిచెందింది?

**Why so Widespread?**

మరణించిన తరువాత కూడా ఆత్మ లేక ప్రాణము జీవించేవుంటుంది, అనునది బైబిలు నందు ఎప్పటునూ లేదు. అయితే ఎన్నో మతాలకు సంబంధించిన ప్రజలు, ఈ విషయాన్ని బలంగా నమ్మగలిగేంతగా ఎలా వ్యాప్తిచెందింది? అనే ప్రశ్న మనకు కలుగవచ్చు.

పై ప్రశ్నకు వివరణ ఎంతో సరళంగావుంటుంది. ఈ "మరణములేని ఆత్మ" అనునది, ప్రతి దేశములోను ప్రాచీన కాలమునుంచి కూడా ఉన్నటువంటి మానసికమైన భావము మాత్రమే. ఇది మనుష్యజాతి యొక్క మనస్సులో చాలా కాలంగా ప్రబలివున్న ఆలోచన మాత్రమే. ఈ ఆలోచన ప్రారంభపు క్రైస్తవ్యం మీద ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపించింది. అయితే ఇది తిరస్కరించబడింది. ప్రారంభపు క్రైస్తవులు, మనిషి యొక్క స్వాభావిక స్థితి కేవలం నశించునది మాత్రమే అని గ్రహించగలిగేవున్నారు. వారు సువార్త ద్వారా వాగ్దానం చేయబడినటువంటి నూతన జీవితం కొరకు నిరీక్షించారు. మరణించిన వెంటనే కాదు కాని, యేసు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, విశ్వాసంతో మరణించినటువంటి వారు, సమాధుల్లోంచి తిరిగి లేస్తారని విశ్వసించారు, ఏది ఏమైనప్పటికి ఆరకంగా కొంత కాలం గడిచిన తరువాత, పురాతనమైన మతతత్వాలు కలిగిన ఎన్నో దేశాలు (జాతులు) రోమా సామ్రాజ్యంలో ఉద్భవించాయి. ఎంతో మంది మత మార్పిడిలు జరిగి, ఎన్నో ప్రాచీన మతతత్వదేశాలను వారితో కలుపుకున్నాయి. ఆ తరువాత క్రైస్తవ సంఘ నాయకులు

వారియొక్క ఉపదేశాలలో, ఆనాటి మతతత్వవేత్తల భావాలను కలిపి బోధించడానికి ప్రయత్నించారు. గ్రీకు మత బోధనల యొక్క ఉత్పత్తి స్థానం నుండి వెలికితీసిన విషయాలతో కలిపి బోధించడం ప్రారంభించారు, "మరణించని ఆత్మ" అనేది కేవలం వారి అందరికి సంబంధించిన నమ్మకం మాత్రమే.

అయితే, ఎప్పుడైతే బైబిలు బోధించే అసలైన సత్యం ఏంటో అని, కనుగొనడానికి తీవ్రమైన ప్రయత్నం చేశారో, అప్పుడు ప్రారంభపు క్రైస్తవుల నమ్మకాలను అనుసరించడం ప్రారంభమైంది. ఈ రకమైనటువంటి సత్యసంబంధమైన మార్పిడిలు, 16,17వ శతాబ్దమందు యూరోప్ పునఃస్థాపన కాలంలో జరిగింది. ఈ రకంగా ఎన్నో సందర్భాలలో, మతతత్వ శాస్త్రజ్ఞుల సమ్మేళనంలో ఈ సత్యం బహిర్గతమైనది. క్రింద తెలిపిన కొన్ని ఉదాహరణలు చూడండి:

1897లో కేంబ్రిడ్జ్ నందు బ. ఎఫ్. వెస్టకాట్ అను మతతత్వవేత్త, 2 తిమోతి 1:10 మీద ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

మన యొక్క విశ్వాసములకు అతిముఖ్యమైన కేంద్రస్థానము..... మరణించనటువంటి ఆత్మ కాదు కాని మన శరీర పునరుత్థానమే. మన రక్షకుడు, జీవమును అక్షయతను వెలుగులోనికి తెచ్చెను......... ఈ సత్యాన్ని మన మదిలో ఉంచుకొని అపోస్తలుడైన పౌలు యొక్క అత్యంత బలమైన వాక్యాలను చూడగలము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును. (ఫిలిప్పీ 3:21)

1924లో బిషప్ గోరె (లండన్) ఈ విధంగా వ్రాశాడు:

"మానవ భౌతికమైన స్వాభావిక స్థితిని బట్టి, మనిషి యొక్క ఆత్మ అనునది, మరియు అది మరణము లేనటువంటిదై ఉండవలసిన అవసరంవుంది అనునది కేవలము గ్రీకు తత్వము నుండి వెలికితీయబడినదే" అన్యమతాలు భయంకరంగా ప్రబలినటువంటి ప్రపంచ యుద్ధ కాలంలో, చర్చ్ ఆఫ్ ఇంగ్లండు, రాచెస్టర్ అను బిషప్ ఆధీనం క్రింద ఒక కమీషన్ వేయడం జరిగింది. ఎంతో మంది వివిధ మత సంఘాలకు చెందినటువంటి వారు, చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ సమర్పించిన నివేదికలో భాగస్తులైనారు; 1945లో ప్రచురించిన ఆ వార్త యొక్క సారాంశము

ఈ క్రింది విధంగా ఉంది.

"నశించనటువంటి మనుష్యుని ఆత్మ" అను భావము యొక్క పుట్టుక కేవలము గ్రీకు మూలముగా కలిగినదే కాని ఎంత మాత్రము బైబిలు నుండి ఉత్పత్తి అయినదికాదు. క్రొత్త నిబంధన యొక్క ప్రధానమైన ఇతివృత్తము "నిత్యజీవము, ఇది ఏ ఒక్కరికో, మరియు అందరికీ కాదు కానీ, మరణం నుంచి తిరిగిలేచిన క్రీస్తునందు విశ్వాసముగలవారికే వర్తిస్తుంది"

పై తెలిపినన్నియు కూడా అసాధారణమైనటువంటి, తప్పక ఒప్పుకొనవలసిన ప్రకటనలు అంతే కాకుండా, పరిశుద్ధ గ్రంథం నుంచి తీసుకున్న ఆధారాల ద్వారా మనం సత్యాన్ని ఒప్పుకొనబద్ధులమై ఉన్నాము. పురుషులు కాని స్త్రీలు కాని మరణించిన తరువాత అసంకల్పితంగా లేక వారంతట వారే తిరిగి జీవించరు. భౌతికమైననైతిక స్థితిని బట్టి వారు మంటిలో కలిసి పోవలసినదే. ఎవరైతే నిత్యజీవము అను వాదాన్ని సాధించుకుంటారో వారు తిరిగి మంటిలోనుంచి, లేక సమాధుల్లోనుంచి, యేసు క్రీస్తు యొక్క రెండవ రాకడలో, పునఃరుత్థానము అను ప్రతిఫలాన్ని పొందుతారు.

## ప్రాణాధారమైన వర్తమానము:

**The Vital Message**

ఈ ప్రధానమైన అంశం మీద బైబిలు యొక్క ఉపదేశము ఏమైయున్నదో అని మనము ఎంతో సమీక్షించిన తరువాత. ఒక విషయం చాలా స్పష్టంగా విశదమవుతుంది. దీని యొక్క ఉపదేశ సారాంశము మనందరికి కూడా ఎంతో ప్రాముఖ్యమైనది. ఇందు తెలిపిన విషయాలను ఎంత మాత్రము గమనించకపోతే మనము సంపూర్ణంగా నశిస్తాము. అందుకనే ఇది "సువార్త" అని పిలువబడుతుంది. అనగా "శుభవర్తమానము" జీవసంబంధమైనటువంటి విషయాలను అపోస్తలుడైన పౌలు కొరింథీలోవున్న సంఘమునకు ఎలా గుర్తుచేస్తున్నాడో గమనించండి.

మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి. దానియందే నిలిచియున్నారు........ ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనియున్నయెడల

ఆ సువార్తవలననే మీరు రక్షణ పొందువారైయుందురు. (1కొరింథీ 15:1-2) మరియు రోమీయులకు వ్రాస్తూ:

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతి వానికి, మొదట యూదునికి గ్రీసుదేశస్థునికి కూడా రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16)

"నశిస్తున్నటువంటి నేటి మన ప్రపంచమునకు "శుభవర్తమానము" యొక్క అవసరత ఎంత వరకు వుంది......" ఈ నిత్యజీవ సంబంధమైన సువార్తమానము ఇంకా మన మధ్య సంచరిస్తూ ఉండటం ఎంత గొప్ప విషయం, ఈ సువార్త, బైబిలు యొక్క పుటలలోను, యేసు మరియు ఆయన అపొస్తలుల యొక్క వాక్యాలలోను జీవిస్తూనే వుంది. ఈ "జీవ వాక్యము"గురించి తెలుసుకోడానికి మనం ఇప్పుడే ఒక దృఢ నిశ్చయానికి వద్దాం. మనయొక్క భవిష్యత్తు ఎంతో సంకటస్థితిలో ఉన్నప్పటికీ, మారు మనస్సు పొంది క్రీస్తునందు నూతన జీవితం ప్రారంభించడానికి మనకు ఇంకా అవకాశం ఉంది.

**ఫ్రెడ్ పియర్స్**

# మరణము తరువాత - ఏమిటి?

ప్రశ్నలు :-

1. బైబిలు యొక్క గ్రంథకర్తలు అధికారయుక్తంగా ప్రేరేపింపబడినారు. దీని అర్థమేమి? వారిని ప్రేరేపించినది ఎవరు?

2. కొన్ని తర్జుమాలలో బైబిలు నందు జీవించు ఆత్మలు అని వ్రాయబడివున్నది. జీవించు ఆత్మ అనగా నేమి?

3. ఆదాము మరియు హవ్వలకు, మీరు మరణిస్తారని మీరు మన్నే గనుక తిరిగి మన్నైపోదురని దేవుడు ఎందుకు చెప్పాడు?

4. మనుష్యులు మరణించిన తరువాత వారికి ఏం జరుగుతుందో బైబిలు నుండి ఒక ఆధారమును చూపించుము?

5. బైబిలు ప్రకారముగా మనము మరణము తరువాత జీవమును గూర్చి ఏరకమైన నిరీక్షణను కలిగివున్నాము?

6. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, నిత్యజీవమును పొందుటకు మరణమునుంచి తిరిగి ఎవరు లేపబడతారు?

7. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, పాపవిముక్తిని గూర్చి దేవుని యొక్క సంకల్పమేమై యున్నదో, తెలియని వారికి ఏం జరుగుతుంది.?

8. పునఃరుత్థానము తరువాత నీతిమంతుల యొక్క భౌతిక స్థితి ఎలావుంటుందో వివరించుము?

9. నరకము అనుదానిని గురించి యేసు ఆయన మాటల ద్వారా ఏమని ఉదహరించాడు.?

10. ధనికుడు - మరియు - లాజరు అను ఉపమానం ద్వారా మనము ఎలాంటి పాఠము నేర్చుకున్నాము?

11. దేవుడు తనను విశ్వాసంతో ఆరాధించు వారికి చేసిన వాగ్దానమేమి?